



శ్రీ అభ్యాస్ కిడ్స్ వరల్డ్‌లో ఘనంగా బతుకమ్మ వేడుకలు

❖ *సంప్రదాయ దుస్తుల్లో చిన్నారుల సందడి.. తల్లిదండ్రులతో కలిసి కోలాటం*

దశ ఓయూ: రామంతాపూర్‌లోని శ్రీ అభ్యాస్ కిడ్స్ వరల్డ్ పాఠశాలలో శుక్రవారం బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిన్నారులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సంప్రదాయ దుస్తులు ధరించిన చిన్నారులు రంగురంగుల పూలతో అలంకరించిన బతుకమ్మలతో సందడి చేశారు. తల్లిదండ్రులతో కలిసి కోలాటం ఆడుతూ పండుగ ఉత్సాహాన్ని నింపారు.తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను చిన్నతనం నుంచే పిల్లలకు పరిచయం చేయడంతో పాటు, వారిలో ఐకమత్యం, సృజనాత్మకత, సంప్రదాయాల పట్ల గౌరవాన్ని పెంపొందించడమే ఈ వేడుకల ముఖ్య ఉద్దేశమని పాఠశాల యాజమాన్యం తెలిపింది. చిన్నారులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల భాగస్వామ్యంతో వేడుకలు ఆనందోత్సాహాల మధ్య ముగిశాయి.



మణుగూరులో ముగిసిన ఆర్టీసీ ఎన్నికల పోలింగ్!



దశ, మణుగూరు: మణుగూరు ఆర్టీసీ డిపో పరిధిలో శుక్రవారం నిర్వహించిన ఆర్టీసీ కార్మికుల గుర్తింపు సంఘం ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో ముగిసింది. ఉదయం నుంచే కార్మికులు బారులు తీరి ఉత్సాహంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పోలింగ్ కేంద్రం వద్ద పటిష్ట బందోబస్తు నిర్వహించారు.డిపో పరిధిలో ఉన్న మొత్తం 240 ఓట్లకు గాను 226 మంది కార్మికులు ఓటు వేశారు. పోలింగ్ శాతం భారీగా నమోదు కావడంతో కార్మికులు తమ హక్కుల సాధన కోసం ఈ ఎన్నికల్లో చురుగ్గా పాల్గొన్నట్లు స్పష్టమవుతోంది. మిగిలిన మరో 12 పోస్టల్ బ్యాలెట్ ఓట్లను ఈ నెల 17వ తేదీన లెక్కించనున్నారు. పోలింగ్ ప్రక్రియ ముగియడంతో మరికొద్ది సేపట్లోనే డిపో ప్రాంగణంలో ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుంది.దీంతో గుర్తింపు సంఘంగా ఏ యూనియన్ జయకేతనం ఎగురవేస్తుందనే అంశంపై ఆర్టీసీ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. లెక్కింపు పూర్తయిన వెంటనే తుది ఫలితాలను అధికారులు అధికారికంగా ప్రకటించనున్నారు. స్తారు. 1986లో పాన్ ఆమ్ ఫ్లైట్ 73 హైజాక్ సమయంలో ప్రయాణికులను రక్షించే క్రమంలో ప్రాణత్యాగం చేసిన నీరజ్ భానోత్‌కు 1987లో అశోక చక్ర ప్రదానం చేశారు. అయితే, మచ్చర్‌కు అశోక చక్ర ప్రదానంపై కేంద్ర ప్రభుత్వం నుంచి అధికారిక ప్రకటన వెలువడినట్లు నిర్ధారణ లేదు.

ప్రభుత్వ పాఠశాలలో బతుకమ్మ సంబరాలు



దశ, రామన్నపేట: యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం శోభనాద్రిపురం ప్రాథమికోన్నత పాఠశాలలో జరిగిన బతుకమ్మ సంబరాలలో గ్రామం లోని అక్కా చెల్లెళ్లు 65 మంది హాజరు అయ్యి కార్యక్రమాన్ని మండలం లోనే అతి పెద్ద కార్యక్రమం నిర్వహించడం జరిగింది,గ్రామంలోని మహిళలు బతుకమ్మ సంబరాలలో ఆట పాటలతో రోజు వారీ పని పత్తిడి నుండి ఉపశమనం పొంది ఒక మూడు గంటలు సరదాగా గడపడం జరిగింది,అనంతరం హాజరు అయిన మహిళలకు ఆటల పోటీలు నిర్వహించడం జరిగింది. విద్యార్థుల చేత సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది,విజేతలకు గ్రామ సర్పంచ్ కంచి మధుసూదన్ చేతుల మీదుగా చక్కని ఇత్తడి పూజా దివ్వెలను బహుమతులుగా ప్రధానం చేశారు. దసరా సెలవులకు ముందుగా ఆఖరు పనిదినం కావడం తో క్యాంపస్ లోని 15 మంది మహిళా స్టాఫ్ రోజు వారీ పని పత్తిడిని మరచిపోయి చక్కగా ఆటల, పాటలతో అలరించారు,ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కంచి మధుసూదన్ మాట్లాడుతూ ప్రపంచం లోనే పువ్వులతో మహిళలు జరుపుకునే పండుగ కేవలం మన తెలంగాణ రాష్ట్రం లోనే జరుపుకునే మన రాష్ట్ర పండుగ బతుకమ్మ పండుగ అని, బతుకమ్మ పండుగ అందరి బతుకుల్లో సంతోషం ఆనందం తీసుకురావాలని, పిల్లా పాపలతో, సిరి సంపదలతో, ఆయురారోగ్యాలతో ప్రజలు కలిసిమెలసి జీవించాలని ఆకాంక్షించారు.



చింతకుంటకు పక్కా రోడ్డు వేయండి

ఎమ్మెల్యే పాయంకు ఆదివాసీల వేడుకోలు

దశ, బూర్గంపాడు: గత 25 ఏళ్లుగా రహదారి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్న తమ గ్రామానికి శాశ్వత రహదారి నిర్మించి ఆదుకోవాలని బూర్గంపహాడ్ మండలం మోతె పంచాయతీ పరిధిలోని చింతకుంట గ్రామ ఆదివాసీ గిరిజనులు పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును కోరారు. ఈ మేరకు శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయనను కలిసి లిఖితపూర్వక వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు తమ సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. గ్రామానికి సరైన రహదారి లేక నిత్యం రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాకాలంలో ప్రస్తుతం ఉన్న కాలిబాట మోకాలి లోతు బురద, నీటి గుంతలతో అధ్వానంగా మారుతోందని తెలిపారు. అత్యవసర సమయాల్లో అంబులెన్స్ కూడా గ్రామానికి చేరుకోలేని పరిస్థితి ఉందన్నారు. గర్భిణులు, వృద్ధులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారిని మంచాలపై మోసుకుంటూ ప్రధాన రహదారి వరకు తీసుకెళ్లాల్సి వస్తోందని వాపోయారు. రహదారి సౌకర్యం లేక చిన్నారులు పాఠశాలలకు వెళ్లేందుకు కూడా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధికి మోతె నుంచి చింతకుంట వరకు పక్కా రహదారి నిర్మాణం చేపట్టాలని, విద్యుత్, తాగునీరు వంటి కనీస మౌలిక వసతులు కల్పించాలని కోరారు. గ్రామస్తుల సమస్యలపై ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సానుకూలంగా స్పందించారు. చింతకుంట గ్రామ సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రహదారి నిర్మాణంతో పాటు ఇతర మౌలిక వసతుల కల్పనకు సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. రహదారి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇవ్వడంతో గ్రామస్తులు ఆశాభావం వ్యక్తం చేశారు.

కక్కిరేణి ప్రాథమిక పాఠశాలలో ఘనంగా బతుకమ్మ సంబరాలు



❖ *విద్యార్థుల తల్లుల ఆటపాటలు, కేరింతలతో సందడిగా వేడుకలు*

దశ, రామన్నపేట: యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలం కక్కిరేణి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఏఏపీసీ చైర్మన్, తల్లిదండ్రుల కమిటీ మరియు పాఠశాల ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో శుక్రవారం బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు విద్యార్థుల తల్లులు దాదాపు అందరూ హాజరై చిన్నారులతో కలిసి ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆటపాటలు, బతుకమ్మ పాటలు, కేరింతలతో పాఠశాల ప్రాంగణం సందడిగా మారింది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను అందరూ కలిసి ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ చిల్ల మధురవేణి సురేష్, ప్రధానోపాధ్యాయులు బి. ఉపేందర్, ఏఏపీసీ చైర్మన్ చిల్ల ప్రేమలత మురళీకృష్ణ, ఉపసర్పంచ్ నడిగోటి పాండు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు బి ఉపేందర్ జి మాట్లాడుతూ పాఠశాల పిల్లలకు మన సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పించడంతో పాటు పాఠశాల కార్యక్రమాల్లో తల్లిదండ్రుల భాగస్వామ్యం ఎంత ముఖ్యమో ఈ వేడుకలు చాటిచెప్పాయని మన సంస్కృతి - మన సంప్రదాయం - మన బతుకమ్మ! ను బతకనిద్దాం ఎదగనిద్దాం చదవనిద్దం అనే లక్ష్యంతో కొనసాగిందని తల్లుల్లో మరింత ఆనందాన్ని నింపింది. పాఠశాల నిర్వహించిన ఈ వేడుకలు విద్యార్థులు, తల్లులు, ఉపాధ్యాయులు, గ్రామ ప్రజల మధ్య ఆత్మీయతను పెంపొందించాయి. ముఖ్యంగా తల్లుల్లో మరింత ఆనందాన్ని నింపింది. పాఠశాల నిర్వహించిన వేడుకలో జేపీ మీడియా సహకారంతో ప్రత్యేక ఆకర్షణగా లక్కీ డ్రా నిర్వహించి, వేడుకల్లో పాల్గొన్న విద్యార్థుల తల్లుల్లో ఇద్దరికి చీరలు అందజేశారనీ తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పిట్టరామ్ రెడ్డి, మదూరి సోమేశ్వరరావు, సామాజిక కార్యకర్తవేముల సైదులు, ఉపాధ్యాయులు గణేష్, కృష్ణ, గోపాల్ రెడ్డి, ప్రశాంతి, సంధ్య, భాష, బోయిన శివకుమార్, భవాని, సరిత, లక్ష్మి, సంతోష, లావణ్య, ధనమ్మ తదితరులు పాల్గొన్నారు.

విజయరత్న హైస్కూల్‌లో బతుకమ్మ సంబురాలు



దశ, బోడుప్పల్: హైదరాబాద్‌లోని బోడుప్పల్ విజయరత్న హైస్కూల్‌లో శుక్రవారం పాఠశాల మహిళా ఉపాధ్యాయులు, విద్యార్థినుల ఆధ్వర్యంలో ముందస్తు బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో పాఠశాల సెక్రటరీ, కరస్పాండెంట్ కె. విజయసేనారెడ్డి, పాఠశాల డైరెక్టర్లు ఎం. నరేంద్రనాథ్, ఎం. నర్సింహారావు, కె. శ్రీనివాస్ రెడ్డి పాల్గొని విద్యార్థినులకు బతుకమ్మ పండుగ విశిష్టతను వివరించారు. విద్యార్థినులు తంగేడు, గునుగు, బంతి, చామంతి తదితర రంగురంగుల పూలతో అందమైన బతుకమ్మలను పేర్చి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ సందర్భంగా పాఠశాల సెక్రటరీ, కరస్పాండెంట్ కె. విజయసేనారెడ్డి మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. బతుకమ్మ కేవలం పూల పండుగ మాత్రమే కాదని, ప్రకృతిని ఆరాధించే గొప్ప సంప్రదాయమని పేర్కొన్నారు. ప్రకృతిలో లభించే పూలతో బతుకమ్మలను రూపొందించడం ద్వారా పర్యావరణ పరిరక్షణ, ప్రకృతి పట్ల ప్రేమ, స్థానిక పూల ప్రాముఖ్యతను విద్యార్థులు తెలుసుకుంటారని చెప్పారు.

మన పండుగలు, ఆచారాలు, సంప్రదాయాలను భావితరాలకు పరిచయం చేయడంలో విద్యాసంస్థలు కీలక పాత్ర పోషించాలని అన్నారు.విద్యార్థులు చదువుతో పాటు మన సంస్కృతి,సంప్రదాయాలపై అవగాహన పెంపొందించుకోవాలని పాఠశాల డైరెక్టర్లు ఎం. నరేంద్రనాథ్, ఎం. నర్సింహారావు, కె. శ్రీనివాస్ రెడ్డి సూచించారు. ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థుల్లో సృజనాత్మకత, ఐక్యతాభావం, నాయకత్వ లక్షణాలు, పరస్పర సహకారాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. విజయరత్న హైస్కూల్‌లో నిర్వహించిన ఈ బతుకమ్మ సంబురాలు విద్యార్థినుల్లో ఆనందోత్సాహాలను నింపడంతో పాటు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పట్ల గౌరవాన్ని పెంపొందించాయి. మహిళా ఉపాధ్యాయులు, విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

గిరిజన ఉత్పత్తులను ప్రోత్సహించాలి

దశ, భద్రాచలం: బీజేపీ చేపట్టిన సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా 'వోకల్ ఫర్ లోకల్' కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. బీజేపీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు భద్రాచలంలోని భద్రగిరి మార్ట్‌ను సందర్శించారు. మార్ట్‌లో లభ్యమయ్యే వివిధ రకాల గిరిజన ఉత్పత్తులను పరిశీలించి కొనుగోలు చేశారు. స్థానికంగా తయారయ్యే ఉత్పత్తులకు ప్రోత్సాహం అందించడంతో పాటు, గిరిజన కళాకారులు, చేతివృత్తుల వారి శ్రమకు తగిన గుర్తింపు కల్పించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ, స్థానిక ఉత్పత్తులను కొనుగోలు చేయడం ద్వారా



గిరిజన కుటుంబాలకు ఆర్థికంగా చేయూత అందించవచ్చని తెలిపారు. గిరిజనులు తమ సంప్రదాయ నైపుణ్యంతో తయారు చేసే వస్తువులకు మార్కెట్లో ఆదరణ పెరిగితే వారి జీవనోపాధికి మరింత భరోసా లభిస్తుందని పేర్కొన్నారు. స్థానిక ఉత్పత్తిదారులను ప్రోత్సహించడం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని, ప్రజలు స్వదేశీ వస్తువుల వినియోగానికి ప్రాధాన్యత ఇవ్వాలని పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన 'వోకల్ ఫర్ లోకల్' పిలుపునకు అనుగుణంగా దేశీయంగా తయారయ్యే వస్తువుల కొనుగోళ్లను ప్రోత్సహించాలని సూచించారు. మన ప్రాంతాల్లో తయారయ్యే ఉత్పత్తులకు ప్రజలు ఆదరణ కల్పిస్తే స్థానిక చేతివృత్తులు అభివృద్ధి చెందడంతో పాటు, ఉత్పత్తిదారులకు మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు. ముఖ్యంగా గిరిజన ఉత్పత్తులను ప్రజలకు మరింత చేరువ చేయడం ద్వారా వారి సంప్రదాయ కళలు, వృత్తులను పరిరక్షించవచ్చని వివరించారు. స్థానిక ఉత్పత్తుల వినియోగం పెరగడం వల్ల గిరిజనుల ఆర్థిక స్వావలంబనకు తోడ్పాటు అందడంతో పాటు స్థానిక ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని పార్టీ నాయకులు పేర్కొన్నారు. ప్రజలు తమ అవసరాల కోసం సాధ్యమైనంత వరకు స్థానికంగా తయారైన వస్తువులను కొనుగోలు చేస్తూ గిరిజన ఉత్పత్తిదారులను ప్రోత్సహించాలని కోరారు.

అబ్దుల్లాపూర్‌మెట్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా సీహెచ్ రాజు



దశ, అబ్దుల్లాపూర్‌మెట్ : ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పరిధిలోని అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా సీహెచ్ రాజు నియమితులయ్యారు. ఫ్యూచర్ సిటీ సీసీఆర్‌డీలో పనిచేస్తున్న ఆయన శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించిన వి. అశోక్‌రెడ్డి బదిలీపై హైదరాబాద్ మల్టీ జోన్-2కు వెళ్లడంతో ఆయన స్థానంలో రాజును నియమించారు.

చెల్పూర్ సర్పంచ్‌పై కులం పేరుతో దూషణలు.. కేసు నమోదు!

- *బిల్లులపై సంతకాల కోసం 30 శాతం కమీషన్ డిమాండ్ చేసినట్లు ఆరోపణలు*

దశ, హుజూరాబాద్: కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం చెల్పూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ వంటడుపుల కస్తూరిని కులం పేరుతో దూషించినట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఉప సర్పంచ్ నెరెల్ల శ్రీనివాస్‌పై సర్పంచ్ చేసిన ఫిర్యాదుతో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. వివరాల్లోకి వెళ్తే.. 2026 సెప్టెంబర్ 19న చెల్పూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పంచాయతీ బిల్లులపై సంతకాలు చేయడానికి ఉప సర్పంచ్ 30 శాతం కమీషన్ డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. దీనిపై సర్పంచ్ కస్తూరి ప్రశ్నించడంతో, ఉప సర్పంచ్ తన కులాన్ని ప్రస్తావిస్తూ అవమానకరంగా మాట్లాడారని, ఎస్సీ వర్గానికి చెందిన వ్యక్తులను కించపరిచే వ్యాఖ్యలు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. సమావేశంలో ఉన్న వార్డు సభ్యులు నిందితుడిని వారించినప్పటికీ ఆయన వినకుండా అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు సర్పంచ్ తెలిపారు. ఈ ఘటనపై గ్రామ పెద్దలు ఇరువర్గాల మధ్య రాజీ కుదిర్చేందుకు ప్రయత్నించడంతో పోలీసులకు ఫిర్యాదు చేయడంలో ఆలస్యమైందని ఆమె వివరించారు. సర్పంచ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, ఘటనకు సంబంధించిన వివరాలపై విచారణ కొనసాగిస్తున్నారు. దర్యాప్తు అనంతరం చట్టప్రకారం చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

ఆడబిడ్డల ఆత్మగౌరవానికి ప్రతీక బతుకమ్మ

- *ప్రజ్ఞ స్కూల్ కరస్పాండెంట్ కాచాని కృష్ణమూర్తి*
- *న్యూప్రజ్ఞా పాఠశాలలో ముందస్తు బతుకమ్మ సంబరాలు*



దశ, మునగాల: బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవానికి, సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని న్యూ ప్రజ్ఞ హైస్కూల్ కరస్పాండెంట్ కాచాని కృష్ణమూర్తి అన్నారు. శుక్రవారం మునగాల మండల కేంద్రంలోని పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులు, విద్యార్థినుల ఆధ్వర్యంలో నిర్వహించిన ముందస్తు బతుకమ్మ వేడుకల్లో ఆయన పాల్గొని పండుగ విశిష్టతను వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు తంగేడు, గునుగు, బంతి, చామంతి తదితర రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, సంప్రదాయ దుస్తుల్లో పాటలు పాడుతూ ఉత్సాహంగా ఆడిపాడారు. దీంతో పాఠశాల ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. కృష్ణమూర్తి మాట్లాడుతూ, బతుకమ్మ కేవలం పూల పండుగ మాత్రమే కాదని, ప్రకృతి ఆరాధనకు, మహిళల ఐక్యతకు, కుటుంబ బంధాలకు, సామాజిక సమైక్యతకు ప్రతీక అని పేర్కొన్నారు. ఇలాంటి వేడుకల ద్వారా విద్యార్థులకు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పించవచ్చన్నారు. విద్యార్థులు చదువుతో పాటు మన పండుగలు, ఆచారాల పట్ల గౌరవం పెంపొందించుకోవాలని సూచించారు. సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థుల్లో సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలు, ఐక్యతాభావాన్ని పెంపొందిస్తాయని తెలిపారు.

వికారాబాద్ జిల్లాలో పడిపోయిన భూగర్భ జలాలు

- *రెండేళ్లలో 2 అడుగుల లోతులోకి*
- *ఇంకా పడిపోయే ప్రమాదం*
- *కాపాడకపోతే భావితరాలకు పెనుముప్పు*
- *తీవ్రంగా హెచ్చరిస్తున్న శాస్త్రవేత్తలు*
- *భవిష్యత్తులో యుద్ధం వస్తే నీటి కోసమే*
- *ఇప్పటికే పలు దేశాలు అతలాకుతలం*
- *నీటిని రక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిది*



దశ, తాండూర్ ప్రతినిధి : వికారాబాద్ జిల్లా పరిధిలో భూగర్భ జల మట్టం పెరిగింది. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో సేకరించిన భూగర్భ జల మట్టం స్థాయిల ఆధారంగా ఆయా ప్రాంతాల్లో భూగర్భ జలాలు ఏ స్థాయిలో ఉన్నాయనేది భూగర్భ జల వనరుల శాఖ అధికారులు నిర్ణయించారు. జిల్లా పరిధిలో ఏప్రిల్ నెలతో పోలిస్తే మే నెలలో భూగర్భ జల మట్టం 0.36 మీటర్లు పెరిగింది. ఏప్రిల్ నెలలో వికారాబాద్ జిల్లా పరిధిలో సరాసరి భూగర్భ జలమట్టం 12.58 మీటర్లు ఉండగా మే నెలలో 12.21 మీటర్లకు పెరిగింది.

సెప్టెంబర్ చివరి నాటికి అదే స్థాయిలో తగ్గుముఖం పట్టింది. తద్వారా నెల రోజుల వ్యవధిలో వర్షాకాలం కంటే ముందుగా కురిసిన వానలతో ఈ మేరకు భూగర్భ జలమట్టం పెరిగిందని చెప్పవచ్చు. జిల్లా వ్యాప్తంగా యాలాల మండలం ఎన్మెపల్లిలో 0.72 మీటర్ల లోతులోనే భూగర్భ జలాలు ఉండడం గమనార్హం.

జిల్లాలోని మండలాల వారీగా..

వికారాబాద్ జిల్లా పరిధిలోని 39 బోర్ల ద్వారా భూగర్భ జల మట్టం వివరాలను సేకరించారు. భూగర్భ జల వనరుల శాఖ అధికారులు మే నెల చివరి వారంలో ఈ వివరాల సేకరణ చేపట్టారు. వారు సేకరించిన వివరాల ప్రకారం మర్పల్లి మండలంలో సరాసరి భూగర్భ జలమట్టం 23.54 మీటర్లు, మోమిన్‌పేట్‌లో 8.2 మీటర్లు, నవాబుపేటలో 9.46 మీటర్లు, వికారాబాద్‌లో 27 మీటర్లు, ధారూర్‌లో 14.5 మీటర్లు, బంట్వారంలో 9.98 మీటర్లు, దోమలో 14.1, కులకచర్లలో 15.34, పరిగిలో 15.15, పూడూరులో 8.11, బొంరాస్‌పేట్‌లో 12.09, పెద్దేముల్ 10.5, తాండూరు 7.16, బషీరాబాద్‌లో 10.97, యాలాల 9.59, కొడంగల్‌లో 12.6, దౌల్తాబాద్‌లో 10.30 మీటర్లుగా భూగర్భ జలాల మట్టం ఉన్నట్లు అధికారుల గణాంకాలు వెల్లడిస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా దోమ మండలం దిర్సంపల్లిలో గత నెలతో పోలిస్తే అత్యధికంగా భూగర్భ జలమట్టం పెరిగిందని చెప్పవచ్చు. ఏప్రిల్ నెలలో దిర్సంపల్లిలో భూగర్భ జలమట్టం 42.32 మీటర్లు ఉండగా మే నెలలో 18.47 మీటర్లకు పెరిగింది.

భూగర్భ జలమట్టంతోపాటు శాంపిల్స్ సేకరణ

వికారాబాద్ జిల్లా పరిధిలో మే నెలాఖరులో ఎంపిక చేసిన బోర్లలో భూగర్భ జలమట్టం వివరాల సేకరణతోపాటు నీటి శాంపిల్స్ సేకరించారు. భూగర్భ జలమట్టం వివరాల సేకరణతో గత నెలతో పోలిస్తే భూగర్భ జలమట్టం ఎంత ఉన్నది తెలుస్తుంది. ఇందులో భాగంగా చాలాచోట్ల ఏప్రిల్ నెలతో పోలిస్తే మే నెలలో భూగర్భ జలాలు వృద్ధి చెందాయి. ఇందుకు ప్రధాన కారణం మే నెలాఖరులో జిల్లాలోని పలుచోట్ల వర్షాలు కురియడమని చెప్పవచ్చు.

జిల్లా వ్యాప్తంగా 39 ప్రాంతాల్లో భూగర్భ జలాలు పరిశీలించగా అత్యధిక స్థానాల్లో నీటిమట్టం పెరిగింది. మరోవైపు ప్రతి సంవత్సరం వర్షాకాలం కంటే ముందు ఆయా బోర్లలో నీటి శాంపిల్స్ సేకరించి హైదరాబాద్‌లోని వాటర్ క్వాలిటీ ల్యాబ్‌కు పరీక్షల నిమిత్తం పంపిస్తారు. తద్వారా తాగునీటిలో ఏమేమి, ఏ స్థాయిలో ఉన్నాయనేది వారు పరిశీలించి నివేదికను అందజేస్తారు. తద్వారా ఆయా బోర్లలోని నీరు తాగడానికి అనుగుణంగా ఉన్నాయా, నీటిలో ప్రమాదకర స్థాయిలో ఏవైనా ఉన్నాయా గుర్తించి వివరాలు పూర్తిస్థాయిలో అందించనున్నారు. తాగునీటికి అవకాశం ఉన్నవాటినే వాడుకోవాల్సిందిగా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సూచిస్తుంటారు. లేదంటే బట్టలు ఉతకడానికి, ఇతర అవసరాలకే వాడుకోవాలని తెలియజేస్తారు. అందువల్ల ప్రతి సంవత్సరం ఈ శాంపిల్స్ సేకరించి నీటి పరీక్షలు జరిపిస్తారు. అందుకు అనుగుణంగానే ఈసారి శాంపిల్స్ సేకరించారు.

వర్షాలతో పెరిగిన భూగర్భ జలాలు

వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా మే నెలలో వర్షాలు కురియడంతో భూగర్భ జలమట్టం పెరిగింది. జిల్లా వ్యాప్తంగా 39 ప్రాంతాల్లో భూగర్భ జల మట్టం పరిశీలించాం. గత నెలతో పోలిస్తే మే నెలలో చాలా ప్రాంతాల్లో భూగర్భ జలాలు పెరిగాయి. రుతుపవనాలు సైతం వస్తుండడంతో ఈ నెలలో భూగర్భ జలాలు మరింత పెరిగే అవకాశం ఉన్నది. కాని ఇప్పుడు అడగంటుతున్నాయి.

– జి.దీపారెడ్డి,
వికారాబాద్ జిల్లా భూగర్భ జల అధికారి

స్వచ్ఛతతోనే ఆరోగ్యకర సమాజం



- *చౌటుప్పల్‌లో చెత్త బుట్టలు, మొక్కల పంపిణీ*



దశ, చౌటుప్పల్ : స్వచ్ఛతాహి సేవ-2026 కార్యక్రమంలో భాగంగా చౌటుప్పల్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో చెత్త బుట్టలు, మొక్కల పంపిణీతో పాటు పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ అధ్యక్షతన, కమిషనర్ వెంకటేశ్వర నాయక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మెప్మా సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళా సంఘాల సభ్యులకు తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించడం, చెత్తను సక్రమంగా నిర్వహించడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంపై అవగాహన కల్పించారు. చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ మాట్లాడుతూ పట్టణ పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యతని, ప్రతి ఇంట్లో తడి, పొడి చెత్తను వేరు చేసి మున్సిపల్ సిబ్బందికి అందించాలని కోరారు. చౌటుప్పల్‌ను స్వచ్ఛమైన పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రజలందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలను పంపిణీ చేసి, వాటిని నాటి సంరక్షించాలని సూచించారు. పచ్చదనాన్ని పెంపొందించడం ద్వారా ఆరోగ్యకరమైన వాతావరణాన్ని నిర్మించుకోవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్, కౌన్సిలర్లు కొండనం రాకేష్ రెడ్డి, పోలేపల్లి లక్ష్మి ముత్తయ్య, పల్లె లావణ్య సురేందర్ రెడ్డి, ఉడుతల యాదయ్య, కొయ్యడ శేఖర్, ఆలా శ్రీలత చిరంజీవి, కాసర్ల మంజుల శ్రీనివాస్ రెడ్డి, బొల్లి గాలయ్య, దేప రమ్య రాజు, పాక చిరంజీవి, భత్తుల వాణి విప్లవ్ కుమార్, ఉడుగు జ్యోతి రమేష్, గడ్డం ఇందిరా రాజరత్నం, భత్తుల జయమ్మ దాసు, చింతల ఉమామహేశ్వరి సాయిలు, బుడ్డ సురేష్, పిల్లలమర్రి మధుసూదన్, హన్సు మహమ్మద్, పస్తం గంగారాములు, సందగళ్ల విజయ సతీష్, మహమ్మద్ బాబా షరీఫ్, షేక్ నాబీబి జానీ బాబా పాల్గొన్నారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ శ్రీకాంత్, మున్సిపల్ మేనేజర్ శ్రీధర్ రెడ్డి, ఆర్పో అంజయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ హనుమాన్ ప్రసాద్, పర్యావరణ ఇంజనీర్ రేణు కుమార్, వార్డు అధికారులు, బిల్ కలెక్టర్లు, మెప్మా ఆర్పీలు, మున్సిపల్ సిబ్బంది హాజరయ్యారు.



డ్రంకెన్ డ్రైవింగ్ కేసుల్లో ఆరుగురికి జైలు

- *47 కేసుల పరిష్కారం.. రూ.2.14 లక్షల జరిమానా*

దశ ఓయూ: మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై నమోదైన కేసుల్లో ఆరుగురికి న్యాయస్థానం జైలు శిక్ష విధించింది. ఉస్మానియా యూనివర్సిటీ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన 47 డ్రంకెన్ డ్రైవింగ్ కేసులను శుక్రవారం నాంపల్లిలోని ఎం.ఆర్. కాంప్లెక్స్‌లో ఉన్న ఎనిమిదో జేఎంఎఫ్‌సీ (డీడీ) కోర్టు పరిష్కరించింది.

నిందితులకు మొత్తం రూ.2,14,700 జరిమానా విధించగా, రెండోసారి మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన ఆరుగురికి రెండు నుంచి ఐదు రోజుల వరకు జైలు శిక్ష విధించింది. వాహనాల వారీగా కేసులు: ద్విచక్ర వాహనాలకు సంబంధించి 41, త్రిచక్ర వాహనాలకు సంబంధించి ఐదు, నాలుగు చక్రాల వాహనానికి సంబంధించి ఒక కేసు నమోదైంది. మహమ్మద్ సర్ఫరాజ్, సయ్యద్ జావేద్‌లకు రెండేసి రోజుల చొప్పున, సిద్దిక్, కె. కనకయ్య, మహమ్మద్ జావేద్, ఎస్.కె. యూసుఫ్‌లకు ఐదేసి రోజుల చొప్పున జైలు శిక్ష విధించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల వాహనదారులతో పాటు ఇతర ప్రయాణికులు, పాదచారుల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని ట్రాఫిక్ పోలీసులు హెచ్చరించారు. మద్యం సేవించిన తర్వాత వాహనాలు నడపవద్దని, ట్రాఫిక్ నిబంధనలు పాటించి రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు. డ్రంకెన్ డ్రైవింగ్‌పై తనిఖీలు, చట్టపరమైన చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ



- *పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి*
- *గంజాయి అక్రమ రవాణాపై నిఘా*
- *నేరాల నియంత్రణకు ఆదేశాలు*

దశ, భద్రాద్రి కొత్తగూడెం : పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, నాణ్యమైన దర్యాప్తు ద్వారా సత్వర పరిష్కారం చూపాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ పోలీస్ అధికారులను ఆదేశించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా జూలూరుపాడు పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఆయన స్టేషన్ నిర్వహణ, సిబ్బంది పనితీరు, నేరాల నియంత్రణ, కేసుల దర్యాప్తు పురోగతిని సమీక్షించారు.

ఈ సందర్భంగా పోలీస్ సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించి, స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌ను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వివిధ సమస్యలతో స్టేషన్‌కు వచ్చే బాధితులతో మర్యాదగా వ్యవహరిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ఎస్పీ సూచించారు. అనంతరం స్టేషన్‌లో నమోదైన యూఐ, గ్రేవ్, ప్రాపర్టీ కేసుల వివరాలను పరిశీలించారు.

దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులపై ప్రత్యేక దృష్టి సారించి, దర్యాప్తులో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. క్రైమ్ రికార్డులను క్రమబద్ధంగా నిర్వహిస్తూ, ప్రతి కేసు దర్యాప్తు పురోగతి, పెండింగ్ అంశాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని తెలిపారు. స్వాధీనం చేసుకున్న క్రైమ్ ప్రాపర్టీ భద్రత, గుర్తింపు, కోర్టు సంబంధిత ప్రక్రియలను నిబంధనల ప్రకారం నిర్వహించాలని సూచించారు. సీసీటీఎన్ఎస్ 2.0లో కేసుల వివరాలను సక్రమంగా నమోదు చేయడంతో పాటు ఈసాక్ష్య, నాట్‌గ్రిడ్, గాండీవ వంటి ఆధునిక సాంకేతిక వ్యవస్థలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని పోలీస్ సిబ్బందికి సూచించారు.


గత నేర చరిత్ర కలిగిన వ్యక్తుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని, పోలీస్ స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

గంజాయి అక్రమ రవాణా, వినియోగంపై ప్రత్యేక నిఘా కొనసాగించాలని, యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఎస్పీ తెలిపారు.

అనంతరం పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ, వారి సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ, సీఐ శ్రీలక్ష్మి, ఎస్సైలు జీనత్ కుమార్, మనీషా, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆయుష్ శాఖలో ఉద్యోగాల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

- *రంగారెడ్డి జిల్లాలో 8 పోస్టులు.. ఈ నెల 22 వరకు అవకాశం*



దశ, రంగారెడ్డి : జాతీయ ఆయుష్ మిషన్ (ఎన్ఏఎం) పబ్లిక్ హెల్త్ ప్రోగ్రామ్‌లో భాగంగా రంగారెడ్డి జిల్లాలో ఎనిమిది అవుట్‌సోర్సింగ్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఎంపిక కమిటీ ప్రకటించింది. ఆయుష్ మెడికల్ ఆఫీసర్లు మూడు, ఫార్మసిస్ట్ ఒకటి, సైకోసోషియల్ కౌన్సిలర్ ఒకటి, యోగా ప్రొఫెషనల్ ఒకటి, మల్టీ పర్పస్ వర్కర్లు రెండు పోస్టులను భర్తీ చేయనున్నారు. ఆయుష్ మెడికల్ ఆఫీసర్లకు నెలకు రూ.40 వేలు, యోగా ప్రొఫెషనల్‌కు రూ.28 వేలు, మల్టీ పర్పస్ వర్కర్లకు రూ.15 వేల వేతనం అందించనున్నారు. సైకోసోషియల్ కౌన్సిలర్‌కు ఒక్కో సెషన్‌కు రూ.500 చెల్లిస్తారు. ఫార్మసిస్ట్ వేతన వివరాలు అధికారిక నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. 2026 జూలై 1 నాటికి అభ్యర్థుల వయస్సు 18 నుంచి 44 సంవత్సరాల మధ్య ఉండాలి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వయోపరిమితిలో సడలింపులు వర్తిస్తాయి. ఈ నెల 12 నుంచి 22వ తేదీ వరకు పని దినాల్లో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. విద్యార్హతల ధ్రువపత్రాలు, ఇతర అవసరమైన పత్రాలపై గెజిటెడ్ అధికారి ధ్రువీకరించిన ప్రతులను జతచేసి దరఖాస్తులను స్వయంగా లేదా రిజిస్టర్డ్ పోస్టు ద్వారా సమర్పించాలి. దరఖాస్తులను జిల్లా కలెక్టరేట్ కార్యాలయం, కొంగరకలాన్ గ్రామం, ఇబ్రహీంపట్నం మండలం, రంగారెడ్డి జిల్లా-501510 చిరునామాకు పంపాలి. గడువు తర్వాత అందిన దరఖాస్తులను స్వీకరించరు. పోస్టుల వారీగా విద్యార్హతలు, అనుభవం, ఎంపిక విధానం తదితర వివరాల కోసం అభ్యర్థులు అధికారిక నోటిఫికేషన్‌ను పరిశీలించాలని జిల్లా ఎంపిక కమిటీ సూచించింది.